సంక్షేమానికి చిరునామా సీఎం జగన్



జంగారెడ్డిగూడెంలో కరపత్రాలను అందిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



జంగారెడ్డిగూడెం 2వ వార్డులో జగనన్న కిట్లు అందజేస్తున్న దృశ్యం



ధర్మాజీగూడెంలో స్టిక్కర్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ మట్టా సురేష్

జంగారెడ్డిగూడెం : సంక్షేమానికి చిరునామాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. పట్టణంలో 7వ రోజు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కన్వీనర్ బత్తిని చిన్న, గెద్దాడ రాజు, బల్ల నాని, జహీర్ సుభాని తదితరులు ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పనితీరు బాగుందని ప్రజలు సంతోషంగా చెబుతున్నారని అన్నారు. వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛను అందిస్తుండడంపై వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 సీట్లు సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. నాలుగవ వార్డు ఇందిర నగర్ కాలనీ కొత్తపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వార్డు ఇంచార్జ్ చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ పథకాలన్నీ వివరించారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏమైతే హామీలు ఇచ్చి నెరవేర్చలేదు, జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ఏ విధంగా ఉందో వివరిస్తూ ముందుకు సాగారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేసి గెలిపించుకుంటామని ప్రజలు పేర్కొంటున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు తెలిపారు. సచివాలయం కన్వీనర్ పి.సరస్వతి రాజా, గృహసారథులు చిప్పాడ కుమారి, కుమన పండు, సుంకర లక్ష్మి, మాచవరపు నాగేంద్ర, చల్లపల్లి కనకదుర్గ పాల్గొన్నారు. పట్టణంలోని 14వ వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సంక్షేమ పథకాల అమలులో ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండడుగులు ముందుకు వేసి సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపారని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు అన్నారు. గురువారం స్థానిక రెండో వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, ఆ వార్డు కౌన్సిలర్ పెసరగంటి గంగ, ఒకటో వార్డు కౌన్సిలర్ ముప్పాని రమణ, సచివాలయ కన్వీనర్లు గెద్దాడ శ్రీనివాసరావు, పెసరగంటి త్రిమూర్తులతో కలిసి ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో ప్రజలు పొందిన లబ్ధిని గురించి వివరించారు. అలాగే టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు పడిన ఇబ్బందులను గురించి కూడా వివరించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తిన చిన్నా, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

లింగపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని లింగపాలెం వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. గురువారం ధర్మాజీగూడెంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరించి జగనన్న డోర్ స్టిక్కర్లు అందజేశారు. వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. గృహ యజమానుల అనుమతితో ఇంటికి సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను అతికించారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



నరసన్నపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : దేశ చరిత్రలోనే ఇంటింటికీ వివిధ పథకాల ద్వారా సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. నరసన్నపాలెం సచివాలయంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావుతో కలసి గ్రామంలో ఇంటింటికీ పర్యటించి పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. పథకాలు నేరుగా ప్రజలకు అందిస్తుండడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని, ఇది చూసి ఓర్వలేక పచ్చమీడియాను అడ్డం పెట్టుకుని టీడీపీ దుష్ ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. ప్రజలు టీడీపీ కల్లబొల్లి మాటలు వినే ప్రసక్తే లేదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునునూరి వెంకటలక్ష్మి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల సచివాలయాల ఇన్‌చార్జి అన్నపనేని శాంతరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, ముత్యాల రాధాకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడేపల్లి శాంతరావు, కె రమేష్, హేమ ప్రభాకరెడ్డి, రావి కొండయ్య, మందలపు నరిశింహరావు, కె.ఆనంద్, కె.రఘు, యలమంచిలి సత్తిబాబు, కోటగిరి పాపారావు, నూతలపాటి శ్రీను, లక్కపాం శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు నరసన్నపాలెంలో...

నరసన్నపాలెంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎలీజా హాజరవుతారని మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు పూర్తి పరిహారమివ్వాలి

ఆదివాసీ మహాగర్జన సభలో వక్తల డిమాండ్



ఆదివాసీ మహాగర్జన మహా సభలో మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

వేలేరుపాడు : పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి పరిహారం ఇవ్వాలని ఆదివాసీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివాసీ మహాగర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వాసితుల నిధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముందుగా ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియం నుంచి వేలేరుపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన గిరిజన సాంప్రదాయాలతో డోలు కొమ్ములతో చేసిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో మహాగర్జన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, కాకి మధు, మూర్రం వీరభద్రం, రాష్ట ఆదివాసీ నాయకులు కారం దారయ్య, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, సర్పంచ్‌లు కట్టి ఉదయ్ కిరణ్, పిట్టా ప్రసాద్, మడివి దుర్గారావు, సోడే శీతారామయ్య, బందం ప్రసాద్, ధర్ముల రమేష్, పైదా రమేష్, కారం బొజ్జి, చీమల వెంకటేశ్వర్లు, గొంది నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించాలి



స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న గంజిమాల దేవి

కొయ్యలగూడెం : స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్‌గా నియమితులైన నేపథ్యంలో గంజిమాల దేవి గురువారం రాజమండ్రిలో కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాపరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపడానికి స్వచ్ఛందంగా సేవలు అందించాలని చైర్మన్ ప్రతాపరెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు. పరోక్షంగా పార్టీకి నిబద్ధులమై కృషి చేస్తూనే ప్రత్యక్షంగా ప్రజల ఆరోగ్య ప్రమాణాల ప్రామాణికంగా స్టేట్ ఫుడ్ కమిషన్ పని చేయాలన్నారన్నారు. కమిషన్‌లో ఎస్సీ వర్గానికి కేటాయించిన స్థానానికి తనతో సహా మరో ముగ్గురు మెంబర్లు చైర్మన్‌తో కలిసి విధులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. గతేడాది స్టేట్ ఫుడ్ కమిషన్ ఏర్పాటు కాగా దఫ దఫాలుగా చైర్మన్ మెంబర్ల నియామకాలు పూర్తయ్యాయని మరో నాలుగేళ్ల పాటు కమిషన్ మనుగడలో ఉంటుందన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కామవరపుకోట: రావికంపాడు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం వేము శ్రీరామమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు, అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లమోతుల సత్యనారాయణ, సతీష్ కుమార్, రవీంద్రరావు, బిరుదుగడ్డ నాగేశ్వరరావు, చిన్న పల్లాలు, మురళీ, జయరాజు, బాలాజీ, విజయకుమారి, చైతన్య, రాధిక, జయశ్రీ, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

ద్వారకాతిరుమల: దీనజనోద్ధరణకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారని యూటీఎఫ్ నేతలు అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో గురువారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ అందరి వాడన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.దేవానందరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, జయరాజు, పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లీలాకుమార్, రాంబాబు, శ్రీనివాస్, మోహన్‌రాయ్, బెనర్జి, చిన్నబాబు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పోలవరం రూరల్ : కొత్తపట్టిసీమ సమీపంలో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, డీటీ ఎన్ ప్రసాద్‌లకు అందిన సమాచారం మేరకు గురువారం కన్నాపురం నుంచి తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడికి 48 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా కొత్తపట్టిసీమ సమీపంలో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామన్నారు. టి.చక్రపాణి అనే వ్యక్తి ఆటోలో ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యర్రంపేటలో 20 క్వింటాళ్ల పట్టివేత

కొయ్యలగూడెం : అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యం కలిగి ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ టి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం యర్రంపేట గ్రామం నుంచి బొలెరో ట్రక్ వాహనంలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణాకు సంబంధించి మాదేటి పవన్, మాదేటి రాజు, 6ఎ, 7(1) కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం మొత్తం విలువ రూ. 2,30,000 ఉంటుందన్నారు. తనిఖీల నేపథ్యంలో ఎస్సై జీజే విష్ణువర్ధన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

కరోనా కేసుల నమోదుతో అప్రమత్తం

కుక్కునూరు : కుక్కునూరు మండల సరిహద్దులోని కుదుములపాడు, మండలంలోని మారేడుబాక గ్రామాలలో కరోనా పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కుక్కునూరు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం కుక్కునూరు పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మండల ప్రజలు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాస్కులు ధరించి, భౌతికదూరం పాటిస్తూ కరోనా బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్‌గా నిర్ధారణైతే వారికి తగిన మందులు అందజేసి హోమ్ ఐసోలేషన్‌లో ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యుడు డా.శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

16న ఉచిత వైద్యశిబిరం

బుట్టాయగూడెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 16న ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. రాజమండ్రికి చెందిన సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. గుండె, నరాలు, మెదడు, ఎముకలు, మూత్ర నాళాల సమస్యలు, ఊపిరితిత్తులు, కడుపులో గ్యాస్ సంబంధిత సమస్యలు, చెవి, ముక్కు, గొంతు వంటి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇస్తారని చెప్పారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్‌లు కూడా చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇఫ్టూ మహాసభలను జయప్రదం చేయాలి

జంగారెడ్డిగూడెం : తిరుపతిలో ఈనెల 16, 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య అఖిలభారత 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. శ్రామికులు పోరాడి త్యాగాలతో సాధించుకున్న హక్కులను నేడు బీజేపీ ప్రభుత్వం తొలగిస్తుండడం అన్యాయమన్నారు. పని గంటలను పెంచిందని, నిత్యవసర వస్తువులు సామాన్య ప్రజలు కొనే విధంగా లేకుండా భారీ స్థాయిలో పెంచి వేశారని విమర్శించారు. నేడు దేశాన్ని నడిపిస్తున్నది కార్పొరేట్ సంస్థలేనని, వారి తొత్తులుగా ఉన్నవారు పార్టీల ముసుగు వేసుకొని దేశ ప్రజలను దోపిడీ చేస్తూ దేశ సంపదను అమ్మకానికి పెట్టి పరిపాలిస్తున్నారన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని, ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించడం కోసం ఈ అఖిలభారత మహాసభలో చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేష్, పాడిదోలు దుర్గారావు పాల్గొన్నారు

చలివేంద్రాల ఏర్పాటు

జంగారెడ్డిగూడెం : వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ చలివేంద్రాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు వరలక్ష్మి, రమేష్, వీఆర్వో బాజి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పోలవరం రూరల్ : స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని గురువారం ఉదయం తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు ప్రారంభించారు. వేసవికాలం కావడంతో వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

సరిపల్లిలో దొంగల బెడద

కొయ్యలగూడెం: సరిపల్లి గ్రామంలో దొంగల బెడద ఎక్కువైందని రైతులు వాపోతున్నారు. గ్రామంలో ఇటీవల గేదెలు, కోడిపుంజులు, మేకలు, అదేవిధంగా పశువుల కొట్టంలోని సామగ్రి దొంగతనానికి గురవుతున్నాయంటున్నారు. ఇటీవల సుమారు రెండు లక్షల రూపాయల విలువ చేసే నాలుగు జాతి కోడిపుంజులను దొంగతనం చేశారని తోట సురేష్ బాబు అనే రైతు పేర్కొన్నారు. అదేవిధంగా రెండు పాడి గేదెలు నాలుగు రోజుల క్రితం దొంగతనానికి గురికాగా వాటిని గ్రామంలోని సుదూర ప్రాంతంలో దుండగులు కట్టిపడేసి వెళ్లిపోయారన్నారు. స్థానికంగా ఉంటున్న కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో గ్రామంలో ఎక్కువగా సంచరిస్తున్నారని వారిని ప్రశ్నిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని పశువులను, విలువైన వస్తువులను కాజేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ వారు దుండగులను గుర్తించి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్ : ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో సూరయ్య చెరువులో గురువారం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి రాజ, వార్డు సభ్యులు జుజ్జవరపు శ్రీను, దమ్మిసెల్లి సైదమ్మ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ధ్వజారోహణం



ఆలయ యాగశాలలో పూజాదికాలు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రానికి ఉపాలయమైన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసునికి జరుగుతున్న దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ధ్వజారోహణ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఈ వేడుక నేత్రపర్వంగా జరిగింది. ఉదయం ఆలయంలో కల్యాణమూర్తులకు అర్చకులు విశేష పూజాదికాలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం నిమిత్తం యాగశాలలో ధ్వజపటంపై గరుత్మంతుని చిత్రపటాన్ని అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో లిఖించారు. హోమాది కార్యక్రమాల అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ధ్వజపటానికి హారతులిచ్చి, దానిని ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఆగమ విద్యార్థులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దివ్యసన్నిధిలో మూలా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం రాత్రి తొలి చండీహోమం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు సుదర్శనం వేణుగోపాల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంకు చెందిన వేదిక్ జ్యోతిష్యులు, వేదపండితులు నుదురుపాటి వెంకట పార్వతీశం, శ్రీసూర్య, ఉభయదారులు కర్పూరం కృష్ణ, అప్పన నాగేశ్వరరావు దంపతులు, ఆలయ కమిటీ కార్యదర్శి మాడా రామ మోహనారావు, చిన్ని మారుతీ సాయికుమార్, తిరువూరుకు చెందిన గుండా శ్రీనివాసరావు, పద్మావతీదేవి దంపతులచే చండీహోమం వేదోక్తంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్, కేఎల్ఎన్ ధనకుమార్, కమిటీ ఉపాధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివదేవుని కల్యాణం

కొయ్యలగూడెం: యర్రంపేట శివాలయంలో శ్రీ ఉమా సమేత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మండపంలో దేవేరితో సహా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు కల్యాణ క్రతువు ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించగా పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు.

వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్ బాబు ఆకస్మిక మృతి



ప్రసాద్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి : సీతానగరం ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్మడపు ప్రసాద్ బాబు (47) గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ప్రసాద్ బాబు పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకి రెడ్డి తదితరులు ప్రసాద్‌బాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన మృతి పట్ల చింతంపల్లి సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు, వెంకటాద్రిగూడెం సర్పంచ్ ఆర్‌వీ రామారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, జి రమణయ్య, గిరి భోగారావు, సీహెచ్ నరేంద్రరాజు సంతాపం తెలిపారు.

పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ త్వరలో పోలవరం నుంచి అమరావతి వరకు పాదయాత్ర నిర్వహిస్తామని సీపీఐ రాష్ట కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తెలిపారు. గురువారం పోలవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు పార్టీలకతీతంగా పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు, తిరుమలశెట్టి రవికుమార్, కొరమాటి సతీష్, ఎం.ప్రసాద్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కివ్వాకలో ఇళ్ల సర్వే

కుక్కునూరు : పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో మండలంలో ముంపునకు గురవుతున్న కివ్వాక గ్రామానికి సంబంధించి ఇళ్ల పరిహారం జాబితాలో చోటు దక్కని వారి ఇంటి చుట్టు కొలతలను గురువారం ఆర్అండ్‌బీ అధికారులు సేకరించారు. ఇళ్ల పరిహారం చెల్లింపునకు సంబంధించి అధికారులు ఇచ్చిన పేపర్ నోటిఫికేషన్‌లో కివ్వాక గ్రామంలో 106 పేర్లు లేకపోవడంతో బాధితులు ప్రాజెక్ట్ అడ్మిస్ట్రేటర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీంతో అధికారులు మరోమారు ఇంటి కొలతలు తీసుకున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ సారైనా ఇంటి విలువ జాబితాలో తమ పేర్లు చేర్చి పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని బాధిత నిర్వాసితులు కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

కొయ్యలగూడెం : సండే స్కూల్ చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేసినట్లు జీసస్ హెల్ప్ మినిస్ట్రీస్ పాస్టర్స్ కె.రాజశేఖర్, ఆనందబాబు, సురేష్ తెలిపారు. యర్రంపేట పంచాయతీ పరిధిలోని తిమ్మనకుంటలో గురువారం 31 మంది చిన్నారులకు నోట్ బుక్స్, విద్యా బోధనతో కూడిన బుక్‌లెట్లు, పలకలను అందించామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కల్లుమామిడిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : ఏజెన్సీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై గిరిజనులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్ఎన్‌డీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మసూద్‌బిన్ ఖలీల్ సూచించారు. గురువారం ఏజెన్సీ ప్రాంతంలోని కల్లుమామిడి, చింతపల్లి గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే చేసి అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జ్వరంగాని, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యశాలలకు రావాలని, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, ఏఎన్ఎం లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.